క్లుప్తంగా

రైతులకు 40 శాతం రాయితీపై డ్రోన్లు

ప్రత్తిపాడు: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 40 శాతం రాయితీపై డ్రోన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని మండల వ్యవసాయశాఖాధికారి యింటి వీర గంగాధర్ మంగళవారం తెలిపారు. ఐదుగురు రైతులతో కూడిన సంఘానికి ఈ డ్రోన్లు మంజూరు చేస్తారన్నారు. పది లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ డ్రోన్ల ద్వారా పంటలకు సులభంగా పురుగు మందులు పిచికారీ చేయవచ్చన్నారు. వీటిని వినియోగించడం సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. ఆసక్తి కల రైతులు మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గురుకుల పాఠశాల విద్యార్థులపై ఫిర్యాదు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులపై పలువురు రైతులు మంగళవారం డీసీఓ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులు గత కొంతకాలంగా సమీపంలో పంటలను, భూముల్లోని వ్యవసాయ సామగ్రిని ధ్వంసం చేస్తున్నారన్నారు. వసతిగృహం ఆవరణలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ పంట పొలాల్లో మలవిసర్జన చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాదానంకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డీసీఓను కోరారు. దీనిపై విచారణ జరిపి అవసరమైన చర్యలు చేపడతామని డీసీఓ రైతులకు హామీ ఇచ్చారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

తుని: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం రెవెన్యూ అధికారి సాల్మన్ రాజు ఆధ్వర్యంలో అధికారులు పర్యటించారు. ఈ నెల 25 లోగా ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయా పన్ను చెల్లించాలని యజమానులకు సూచించారు. అత్యధిక బకాయిలు ఉన్న వారు రెండు వాయిదాల్లో చెల్లించాలని సాల్మన్‌రాజు సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే వల్లీ, కె.శివాజీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సారాతో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలో సోమవారం అర్ధరాత్రి అక్రమంగా సారా తరలించి, విక్రయిస్తుండగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇ.గోకవరం గ్రామానికి చెందిన పూజల సత్తిబాబు, మాడెం గణేష్ బైక్‌పై బురదకోట గిరిజన తండా నుంచి పది లీటర్ల సారాను తరలిస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఈబీ సిబ్బంది నిఘా ఏర్పాటు చేసి ఒమ్మంగి గ్రామ రామాలయం వద్ద సత్తిబాబు, గణేష్, ఒమ్మంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావుకు సాగా విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి, వారి నుంచి బైక్, సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ దాడిలో స్థానిక ఎస్‌ఈబీ ఎస్సై ఆర్.మోహన్‌రావు, సిబ్బంది కృష్ణార్జున, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏలేశ్వరం: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు కోరారు. మండలంలోని యర్రవరంలో మంగళవారం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పిలి ప్రాజు అధ్యక్షతన ఆ సంఘ జిల్లాకార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సదర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆర్థిక విధానాలకు విడనాడాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేఎస్ సుబ్రమణ్యం, బూర్ల సత్యప్రసాద్, చంద్రశేఖర్, వెన్నా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతమ్‌కుమార్

తుని: స్థానిక రోటరీక్లబ్ హాలులో మంగళవారం ఉచిత గ్యాస్ట్రో లివర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయుడు ప్రారంభించారు. గ్యాస్ట్రో డాక్టర్ గౌతమ్‌కుమార్ తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన 150 మందికి లివర్ స్కానింగ్, షుగర్, బీపీ పరీక్షలు చేసినట్టు తుని రోటరీక్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల సతీష్ తెలిపారు. డాక్టర్లు ఎస్‌వీ సుబ్బారావు, సీహెచ్ శ్రీమన్నారాయణ, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్



ఏలేశ్వరం గురుకుల కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు

ఏలేశ్వరం: ఇంటర్మీడియెట్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకూ జరగనున్నాయి. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఏలేశ్వరం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాలతో పాటు మూడు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 336 మంది, ద్వితీయ సంవత్సరం 320 మంది, గురుకుల బాలికల కళాశాలలో ప్రథమ సంవత్సరం 322 మంది, ద్వితీయ సంవత్సరం 302 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ఉదయం నుంచి 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తొలిసారిగా ఇన్విజిలేటర్లు జంబ్లింగ్ విధానంలో విధులకు హాజరుకానున్నారు.

సీసీ కెమెరాలతో నిఘా

ఇంటర్ పరీక్షలకు సీసీ కెమెరాల నిఘాలో జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాంపీయింగ్‌ను అరికట్టేందుకు పారదర్శకంగా ప్రతి విద్యార్థి స్వేచ్ఛగా పరీక్షలు రాసేందుకు వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షల నిమిత్తం గురుకుల కళాశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా చంద్రశారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పలివెల శివాజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌హెచ్ కుమారి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా కె.చినబుజ్జి వ్యవహరించనున్నారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశారద పరీక్షల కేంద్రాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కిర్లంపూడిలో 483 మంది..

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కల్యాణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ కళాశాలకు చెందిన సుమారు 483 మంది విద్యార్థులు కిర్లంపూడి జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తారన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

శంఖవరం: మండలంలోని ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను అన్నవరం ఎస్సై శోభన్ కుమార్, రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని కత్తిపూడి సీతారామా, శంఖవరం ఆదర్శ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరించాలి

గోకవరం: గ్రామంలో నిర్మిస్తున్న రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సంఘం సభ్యులు సహకరించాలని రజక చైతన్య సంస్థ జగ్గంపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంటి వెంకటేష్ కోరారు. గోకవరంలో నిర్మాణ దశలో ఉన్న రజక కమ్యూనిటీ హాలు వద్ద మంగళవారం మండల రజక చైతన్య సంస్థ సమావేశం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శి భీమవరపు వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన సంస్థ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం రజకులకు కేటాయించిన స్థలంలో ఎంపీపీ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం శ్లాబ్ వేశామని, మిగిలిన నిర్మాణానికి సంఘం సభ్యులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల చైర్మన్ తాడి కృపారావు, గౌరవాధ్యక్షుడు కోనేటి నాగరాజు, తెల్ల రామారావు, ర్యాలి రాంబాబు, రాఘవ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన సేవలు అందించాలి



కరెళ్ల గణపతిరావును సత్కరిస్తున్న డాక్టర్ పాండురంగరావు

తుని: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో బీహెచ్ఎంపీఎలు కీలక పాత్ర పోషించాలని డాక్టర్ చిలుకోటి పాండురంగారావు సూచించారు. మంగళవారం మార్కండ్రాజుపేట మెడిలింక్స్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో బేసిక్ హెల్త్‌కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా న్యూఢిల్లీకి చెందిన సంస్థ నుంచి ఇటీవల డాక్టరేట్ అందుకున్న బీహెచ్ఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు కరెళ్ల గణపతిరావు, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ తెలగం శెట్టి రమేష్‌బాబులను గ్రామీణ వైద్యులు సత్కరించారు. డాక్టర్ అనూష, టి.చంద్ర మౌళీశ్వరరావు, నేరెళ్ల సత్యనారాయణ, ఖాదర్, డి.సత్యనారాయణ, మల్లాది ఈశ్వరరావు, యండవల్లి నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



ప్రత్తిపాడులో బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: గ్రామంలోని అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు చేయూత నందించారు. బాధితులు నిమ్మకాయల మధులత, అంబికాదేవీ కుటుంబాలకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆర్థి సహాయంతో ఒక్కో కుటుంబానికి 25 కేజీల వంతున బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు, రూ. 1,500 నగదును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తినష్టం



ప్రత్తిపాడులో బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సీఐ కిషోర్‌బాబు

ప్రత్తిపాడు: గ్రామంలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలోని నిమ్మకాయల మధులత, జిమ్ము అంబికాదేవి కుటుంబాల వారు తాటాకింట్లో నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. దీంతో బాధితులు పిల్లలను తీసుకుని, బయటకు పరుగుపెట్టారు. ఆ సమయంలోనే రెండు గ్యాస్ సిలెండర్లు పేలడంతో ఇంటికి మంటలు వేగంగా వ్యాపించాయి. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. సమస్తం కాలి బూడిదకావడంతో రెండు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎంజీ రత్నరాజు, తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అగ్నిమాపక సిబ్బంది అంచనా చేశారు.

పోలీసుల ఉదారత

అగ్నిప్రమాదానికి గురైన ఇంటిని మంగళవారం ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు, ఎస్సై ఎం. పవన్‌కుమార్ సందర్శించారు.బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులను సీఐ కిషోర్‌బాబు అందజేసి ఉదారతను చాటుకున్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం గ్రామానికి చెందిన కరణం ఆదినారాయణ ఒమ్మంగిలో రెండు ఎకరాల్లో గడ్డిని రూ.10 వేలకు కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తరలిస్తుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డి, ట్రాక్టర్ ట్రక్కు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.1.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

ఆసుపత్రిలో తనిఖీలు



గోకవరం ప్రభుత్వాస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ వైద్యులకు సూచించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రధానమంత్రి నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా ఇద్దరు టీబీ వ్యాధిగ్రస్తులకు గ్రామానికి చెందిన గంగిశెట్టి బాలకోటేశ్వరరావు సహకారంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.వసుంధర, డాక్టర్ వనజాకుమారి, డాక్టర్ ప్రదీప్‌సుందర్, కాయకల్ప టీం సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

శంఖవరం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలందించాలని జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైన్ నిర్మాణ పనులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో డ్రైన్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలోని ఎస్సీ పేటలో డ్రైన్ నిర్మిస్తున్నారు. కాగా ఈ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ పీతల నూకరాజు పరిశీలించారు. గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఆయన వెంట వార్డు సభ్యులు పెదాడ శ్రీను, సలగల నాగమణి ఉన్నారు.

ప్రజాసేవే పరమావధిగా..



కోటనందూరులో చైతన్య గోదావరి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ కామేశ్వరరావు

కోటనందూరు: ప్రజాసేవే పరమావధిగా చైతన్య గోదావరి గ్రామీణబ్యాంకు సేవలను విస్తరిస్తున్నామని ఆ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. కోటనందూరులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 243వ శాఖను మంగళవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాల్లో 17 వేల కోట్లకు పైబడి వ్యాపార లావాదీవీలు సాగిస్తూ 28 లక్షల మంది ప్రజలకు సేవలందిస్తుందన్నారు. 48 వేల స్వయం సహాయక సంఘాలకు రూ.2,700 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. 7,644 కోట్లు డిపాజిట్లు సేకరించగా రుణాలు, వివిధ అడ్వాన్సుల రూపంలో 8,600 కోట్లు చెల్లించామని వివరించారు. కార్యక్రమంలో తలుపులమ్మ దేవస్థానం ఈఓ పెన్మత్స విశ్వనాథరాజు, శివబాబు, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్, క్యాషియర్ భాస్కర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

జగ్గంపేట: ఏఐఎఫ్‌టీయూ ఉభయ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి మోత వెంకట్రావు వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కోరారు. స్థానిక రంగవల్లి నగర్‌లో మంగళవారం వెంకట్రావు వర్ధంతి సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 21న రాజమహేంద్రవరంలోని విక్రమ హాల్లో జరిగే వర్ధంతి సభలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆల్బెండజోల్



జగపతినగరం విద్యార్థిలతో మాత్రలు మింగిస్తున్న డాక్టర్ రాంబాబు నాయక్



తొండంగి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినితో మాత్రలు మింగిస్తున్న వైస్ ఎంపీపీ గంగబాబు

- ఘనంగా నులిపురుగుల నివారణ దినోత్సవం
- 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రల పంపిణీ

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. గ్రామాల్లోని 1 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఏలేశ్వరం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావు, ఎంఈఓ అబ్బాయి, వైద్యాధికారి చంద్రకిరణ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు వైద్యసిబ్బంది అల్బెండజోల్ మాత్రలు వేశారు. మండలంలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలు 16,807 మంది ఉండగా వారిలో 15,975 మందికి మాత్రలు వేసినట్టు తెలిపారు.

కిర్లంపూడి: మండలంలోని 13, 200 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం 75 శాతం మందితో ఆల్బెండజోల్ మాత్రలను మిగించినట్లు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబునాయక్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులతో మాత్రలు మింగించారు.

91 శాతం మంది విద్యార్థులకు..

గోకవరం: మండలంలోని 91 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేసినట్టు కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర తెలిపారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, హెచ్‌ఈ శైలజ, హెచ్ఎమ్ చిమ్మరాజుదొర, తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు 6575 మంది ఉండగా వీరిలో 95 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.సౌమ్య తెలిపారు. పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆమె ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలో 95 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ హరికృష్ణ తెలిపారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆయన ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. రాజపూడి పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, శ్రీరామ్ పాల్గొన్నారు.

12464 మందికి...

తొండంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం ఎంపీడీఓ పసపులేటి సతీష్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని పెరుమాళ్లపురం, ఏవీ నగరం, తొండంగి పీహెచ్‌సీల పరిధిలో 13476 మందికి గానూ 12464 మందికి మాత్రల పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ తెలిపారు.